# నిజాయితీ

-ఉలాపు బాలకేశవులు

వచ్చిన పని వచ్చిన రోజు సాయంత్రానికే అయి తీరుతుందని విశ్వసించిన నాకు ఆ పని మరో మూడు రోజులదాకా కాదని, ఈ హైదరాబాద్ మహానగరంలో ఓ మూడు రోజుల మకాం అనివార్యమని తెలిసి, ఇప్పు డెలా భగవంతుడా! అని అనుకుంటున్న సమయాన ఆపద్బాంధవుడిలా వచ్చి దర్శనమిచ్చాడు దివాకర్. దివాకర్ మా ఊరబ్బాయే. ముఖ్యంగా నా బాల్య స్నేహి తుడు బాలయ్య కొడుకు. ఇక్కడేదో ప్రయివేట్ ఇం డస్ట్రీలో ఇంజనీర్‌గా చేస్తున్నాడు(ట).

"ఏంటంకుల్! హైదరాబాద్ ఎప్పుడొచ్చారు? ఏమిటి విశేషాలు" అంటూ పలకరించే సరికి ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆ పక్కనే ఉన్న ఇరానీ హోటల్‌కి తీసుకెళ్లాడు. సమోసా చెప్తే తిరస్కరించాను. టీ చాలన్నాను. త్రాగడం అయ్యాక నేనీ ఊరొచ్చిన విష యం వివరించాను. తర్వాత కుశల ప్రశ్నలయ్యాయి.

"మీరేం వర్రీ అవకండి అంకుల్. మీ పని పూర్తయ్యే వరకూ మా ఇంట్లో ఉండండి. మేమున్నాం కదా మీకిక దిగులెందుకు? పదండి వెళ్దాం..." అంటూ నన్ను తనతో తీసుకెళ్ళాడు.

దివాకర్ ఇల్లు చాలా బాగుంది. ఓ మధ్య తరగతి నుంచి వచ్చిన కుర్రాడు. పదేళ్లలోపు సర్వీసులో తన స్వీయ సంపాదనతో ఆ మాత్రం ఇల్లు కట్టాడంటే అభినందింపతగిన విషయమే. హైదరాబాద్‌లో.. రద్దీగా ఉండే అమీర్‌పేట ఏరియాలో అతను ఇల్లు అమర్చుకోగలగడం అసాధారణమైన విషయమే. ఇల్లంతా కలియ తిరిగాను. ఆధునిక సౌకర్యాలతో అందంగా అలరారుతోంది. స్నానాదికాలయ్యాక డాబా మీదకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు నన్ను దివాకర్. అతని భార్యా, పిల్లలూ కూడా పైకి చేరారు. వాళ్లంతా కలివిడిగా తిరుగుతూ కలిసిపోయి మాట్లాడుతుంటే నాకు చాలా ఫ్రీగా... సౌలభ్యంగా అన్పించింది. టిఫిన్ తింటూ పరిసరాల్ని గమనిస్తూ ఉన్నాను. ఒక్క దివాకర్ ఇంటిని ఆనుకుని ఉన్న ఇల్లు తప్పనిస్తే ఇరుగు పొరుగు ఇళ్ళన్నీ స్థితిగలవాళ్ళవేననిపిస్తున్నాయి.

నేను ఆ ఇంటినే పరిశీలనగా చూడటం గమ నించాడేమో దివాకర్... "ఆ ఇల్లు ఓ ఆటోడ్రైవర్‌ది. పరమ న్యూసెన్స్‌గా ఉంది ఆ ఆటో అతనితో. అమ్ము తాడేమో ఆ ఇల్లు కూడా ఓ ఇరవై వేలు అదనంగా పెట్టైనా కొందామంటే అమ్మడు" అన్నాడు.

దివాకర్ వైపు నిశితంగా చూశాను.

"అవునంకుల్! ఈ ఖరీదైన ఏరియాలో వాడెందుకు ఉండటం. ఇక్కడి స్థలం అమ్మితే వచ్చే డబ్బుతో... సిటీ ఎక్స్‌టెన్షన్‌లో ఎక్కడైనా మంచి ఇల్లు కొనుక్కో వచ్చు. ఇంకా మిగిలిన డబ్బుతో హాయిగా బ్రతకొచ్చు... కానీ వెళ్లడే."

ఆటో డ్రైవర్ పట్ల దివాకర్ వెళ్లగక్కిన అక్కసు చూస్తుంటే నాకెలాగో అన్పించింది. ఐదే ఎకరాల పొల మున్న ఓ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన దివాకర్- అలా మాట్లాడటం సబబుగా అన్పించడం లేదు. పేదవాడి పొరుగును భరించలేకపోతున్న దివాకర్ స్థితిని ఎదుగుదలగా గుర్తించాలా? ఏమైనా మనసు అందుకు అంగీకరించటంలేదు.

రాత్రి భోజనాల దగ్గర కూడా ఇదే టాపిక్ పునరా వృతమైంది. ఈసారి దివాకర్ భార్య విశాల గళం విప్పింది.

"బాబాయి గారూ! మా పక్కింటి ఆటో అతన్ని ఇక్కడ్నుంచి తరమాలి. ఏం చేస్తే ఇక్కడ్నుంచి బిచాణా ఎత్తుకుని పోతాడో కాస్తంత సలహా ఇద్దురూ..." అంటూ.

నా వెన్నులో సన్నని ముల్లేదో దిగినట్లు కలుక్కు మంది. భార్యా భర్తలిరువురూ ఒకే బడిలోంచి వచ్చిన వారిలా స్ఫురించారు నాకు. చిరునవ్వుని తాత్కాలిక సమాధానం చేశాను తప్ప మరేం మాట్లాడలేక పోయాను.

"ఇప్పటికిప్పుడే కాకపోయినా... మీరు తిరిగి వెళ్లే లోపుగా బాగా ఆలోచించి మంచి ఐడియా చెప్పండి బాబాయిగారూ!" అంది విశాల.

మూడురోజుల అయాచిత ఆశ్రయం దొరికిందని సంబరపడిపోయినందుకు భలే భారం నెత్తిన పడింది. ఇక తప్పదు. వాళ్ళకు తగిన సమాధానం చెప్పమని నాలోని తలనెరిసిన పెద్దమనిషి హెచ్చరించేశాడు. ఇక రంగంలోకి దిగవలసి వచ్చింది. తెల్లారాక టిఫిన్ల కార్యక్రమం జరుగుతున్నప్పుడు, "మీ పక్కింటి అతని వలన మీకొచ్చిన ఇబ్బందేమిటి దివాకర్? ఎందుకింత

సీరియస్‌గా తీసుకున్నారీ విషయాన్ని-" అడిగాను మొదటిగా.

"ఇబ్బంది అని నెమ్మదిగా అంటారేమిటి అంకుల్! పగలూ రాత్రి ఒకటే గోల. డిసిప్లిన్ ఉండదు" అని దివాకర్ అంటే- "ఎప్పుడు చూసినా కొట్టుకోవడాలూ, తిట్టుకోవడాలు. నవ్వులు కేకలు... ఇంతలోనే ఏడుపులు, సముదాయింపులు. అబ్బో ఘోరం..." అంటూ ఆవిడ మొదలెట్టింది. "మా ఇల్లు చూడడానికి వచ్చిన వాళ్ళంతా అంటున్నారు- ఆ ఇంటి వలన మీ ఇంటి కళే పోయిందంటూ- అంత డబ్బు పోసి ఇల్లు కట్టుకున్నందుకు ప్రయోజనమే లేకుండా పోయింది." చాలా బాధపడుతూ చెప్పాడు దివాకర్.

"బాబూ, దివాకర్! ఈ ఏరియాలోకి మీరే మొదటగా వచ్చి ఇల్లు కట్టారా? లేక అతనొచ్చి కట్టుకున్నాడా?" నా మొదటి ప్రశ్న సంధించాను.

"ఈ ఏరియాలో స్థలం అతను ఇప్పుడెక్కడ కొనగలడు? అతని వల్ల అయ్యే పనేనా. ఈ స్థలం అతని పూర్వీకుల నుంచి వచ్చింది." అదోలా వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు దివాకర్.

"అంటే అతను ఈ ఏరియాకి పాతవాడేగా?"

"అవును" దివాకర్ సమాధానం.

"కొత్తగా వచ్చిందే మీరు... అవునా? ఎక్కడ్నుంచో వచ్చి మీరే అతని ప్రక్కన చేరిందిగాక... అతన్నే లేపాలని, ఎక్కడికో తరమాలని చూస్తున్నారు. ఇదేం న్యాయమయ్యా దివాకర్?"

నేనిలా అడుగుతానని ఊహించి ఉండరేమో.. వెన్నుమీద కొరడా ఝళిపించినట్లయి ఉలికిపాటుగా నావైపు చూశారు ఆ భార్యాభర్తలిద్దరూ.

"అవునయ్యా- ఇది స్వతంత్ర భారతదేశం. ఎవరి బ్రతుకు వారు బ్రతికే స్వేచ్ఛ ఉంది. హక్కు ఉంది. అతని ఇన్‌డిసిప్లిన్ నీకెలా నచ్చలేదో, నీ డిసిప్లిన్ అతనికి నచ్చి ఉండకపోవచ్చు. మన పద్ధతులు మనకు నచ్చుతాయి. ఎదుటివాళ్ళకు నచ్చాలని రూలు లేదు. నీకు తాహతుంది- ఇల్లు అందంగా కట్టుకున్నావ్. అతనికా స్థితి లేదు. ఉన్నంతలో కట్టుకున్నాడు. అతనూ బ్రతకాలి కదా మరి. పొరుగింటి వలన మన ఇంటికి కళ పోయిందని వాపోవడం హర్షించదగిన విషయం కాదు. అదంతా కాదు. ఒకవేళ ఆ ఇంటి వారిలో సంస్కారం లోపించిందే అనుకుందాం. అందుకు మనం చేయవలసింది మన పొరుగు నుంచి తరమడం కాదు. ఆ కుటుంబ సభ్యుల్లో లోపించిన సంస్కారాన్ని పూరించే ప్రయత్నం చేయడం-" అని చెబుతూ మధ్యలో ఆగాను. దివాకర్, అతని భార్యవైపు చూశాను. వినకూడని విషయాలేవో విన్నట్లు దిగ్భ్రమకు లోనయిన వాళ్ళలా కన్పిస్తున్నారు ఇద్దరూను.

దివాకర్ నావైపు ఓ నిర్లక్ష్యమైన చూపు విసరి- వెటకారంగా నిట్టూర్చి... "మా ఊరి వాళ్లు- బాగా తెలిసినవాళ్లు- మా శ్రేయోభిలాషిగా మాకేదైనా సలహా ఇస్తారని మిమ్మల్ని అడిగితే- ఉపోద్ఘాతాలు, ఉపదేశాలు మొదలెట్టారేమిటి? చేతకాకపోతే ఊరుకోండి గానీ- ఇలాంటి జోకులు వేయకండి-" అని చాలా హేళనగా అంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. ఆ వెనుకే అతని శ్రీమతి కూడా నన్నో వింత మృగంలా చూస్తూ జారుకుంది.

ముక్కుసూటిగా వ్యవహరించినందుకు నా పెద్దరికాన్ని వాళ్లు బాగానే సత్కరించారు. అంతేకాదు, ఓ గంట గడిచాక దివాకర్ భార్య నా దగ్గరకు వచ్చి-

"మా పిన్నిగారికి బాగోలేదట. నేనూ, పిల్లలూ సికింద్రాబాద్ వెళ్తున్నాం. ఆయన ఆఫీసుకు వెళ్తున్నారు. సాయంత్రం ఆఫీసు అయ్యాక అటునుంచి అటే సికింద్రాబాద్ వచ్చేస్తారు. బహుశా ఈ రెండు మూడు రోజులు మేము అక్కడే ఉండవలసి వస్తుందేమో. కనుక మీరెక్కడైనా బయట లాడ్జి చూసుకోండి" అంటూ సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా అక్కడ్నించి వేగంగా వెళ్లిపోయింది.

## 2008 స్వాగతం

**నూ**తన వత్సరమా / నీకిదే నా స్వాగతం
నీ రాకతో నా జీవితం / చిగురించాలి అనుదినం
కపట కార్పణ్యాలు
వైదొలగాలి నా నుండి బహుదూరం
ప్రేమ వాత్సల్యాలను
నింపాలి నాలో నీ ఆగమనం
సాటి మనుషుల్ని ద్వేషించే
గుణాన్ని చెరపాలి నీ సాన్నిహిత్యం
పశువుల్లో పగలు లేవు/పక్షుల్లో ద్వేషాలు లేవు
గాలికి స్వార్థం లేదు/గంగకు తరతమ భేదం లేదు
మరి ఇవన్నీ ఉన్న నాకు/నువ్వే నేర్పాలి గుణపాఠం
మైలపడ్డ నా మనసును
శుభ్రపరచాలి నీ సాహచర్యం.

-దేవి యాదగిరి

"మీకేం ఫర్వాలేదు, మీ పని పూర్తయ్యే వరకూ మా ఇంట్లోనే ఉండండి" అని చెప్పి నన్ను తన ఇంటికి తీసుకొచ్చిన దివాకర్ 24 గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని మార్చుకోవడంలో ఆంతర్యం బోధపడింది. అతని స్థిరత్వం ఏపాటిదో అంచనా వేసుకున్నాను. నేనేదైనా తప్పుడు సలహా ఇద్దునుకదా... ఇదంతా ఉండేది కాదు. అయినా నేను సలహా ఇచ్చినంత మాత్రాన అది సక్సెస్ అవుతుందని గ్యారంటీ ఏమిటి? వాళ్లు మరి అదేం ఆలోచించకుండా కేవలం మాట మాత్రంగానైనా సహాయపడలేదనే ఆగ్రహంలో ఉన్నారు. ఎదుటి వాడికి మంచి చేయలేకపోయినా చెడు చేయకూడదనేది నా అభిమతం. కనుక నేనటు వంటి సలహా ఇవ్వలేను. ఇవ్వను కూడా. నా పాత బ్యాగును చంకన తగిలించుకుని ఆ ఇంట్లోంచి బయట పడ్డాను. ఏజీ ఆఫీసులో నా పెన్షన్ పని పూర్తికావా లంటే ఇంకో రెండు రోజులు నేను హైదరాబాద్‌లోనే ఉండాలి. కానీ- జేబులో తిరిగి వెళ్లే చార్జీ డబ్బులు గాక మరో వంద మాత్రమే అదనంగా ఉన్నాయి. ఆ మాత్రం డబ్బుతో భోజన వసతులు సమకూరడం చాలా దుర్లభం. అలాగని పని పూర్తి కాకుండానే వెనక్కి తిరిగి వెళ్తే మళ్లీ వెంటనే హైదరాబాద్ రాగలిగే తాహతు మాత్రం నాకు లేదు.

ముప్పై ఏళ్లు బడిపంతులు ఉద్యోగం వెలగబెట్టి రిటైరైన నేను- ఓ మూడువందలు కావాల్సి వస్తే వెతు క్కోవలసిన స్థితిలో ఉన్నానని చెప్పుకోవడం సిగ్గుగానే అన్పిస్తుంది. అయినా నా ఒక్కడి సంపాదన మీద పది మంది ఆధారపడి బతుకుతున్నప్పుడు నా ఆర్థిక పరిస్థితి ఏం మెరుగుపడుతుంది. అయినా దాని గురించి నేను ఎప్పుడూ ఆందోళన చేయలేదు. సిరి లేకపోయినా గిరిలో ఒదిగి బ్రతికే నేర్పుని ఓర్పుని ప్రసాదించాడు భగవంతుడు. అన్నింటికంటే ముఖ్యంగా- తాత్కాలిక అవసరాలకు లాలూచీపడటం, ముఖస్తుతి.. మోహ మాటాలకు పోయి వ్యక్తిత్వాలని సడలించుకునే దౌర్భల్యాన్ని ఇవ్వలేదు. అందుకు మరోమారు భగవం తుడికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

బస్ పాయింట్‌లో నేను వెళ్లవలసిన ప్రాంతానికి వెళ్లే బస్సు ఆగి ఉంది. మరేం ఆలోచించకుండా వెళ్లి బస్సెక్కాను. నన్ను గమ్యం చేర్చే బస్సులో అగమ్య గోచరంగా కూర్చున్నాను. అయినప్పటికీ నాలో ఏదో నిబ్బరం. మరేదో ఆత్మవిశ్వాసం, నాలో నిజాయితి- నా వెనుక కొండంత అండగా ఉన్నట్లనిపిస్తోంది.

## పూలమ్మేవాడు

వాడు-
స్వప్నాలను స్వప్నిస్తూ
వాస్తవంలో బతుకీడుస్తాడు
"బతుకు బస్టాండయిన" ఆ
బస్టాండులోనే ప్రజలకు నిత్యం
పరిమళాలు పంచుతాడు.
ఎంతో ఎదగాల్సిన తన జీవిత వృక్షాన్ని
బొన్సాయిగా మల్చుకొనే శిల్పియతడు
మూరల్లెక్కన మల్లెలమ్ముతూ
జీవితాన్ని బెత్తెల్లోకి నెట్టేస్తాడు.
రూమీ టోపీతో రమ్యంగా కన్పిస్తాడే కానీ
రంగు పూయని కాన్వాస్ అతని జీవితం.
గంపెడు పిల్లల గుంపులో ఒక్కడై,
పేదరిక పాశం ఒకవైపు
నిరక్షరం ప్రసాదించిన అజ్ఞానం ఒకవైపు.
ఎల్లెడలా కమ్ముకున్న
తరతరాల చారిత్రక అన్యాయపు వారసత్వం-
అతనికేమిచ్చాయి?
ఉషస్సులెరుగని తమస్సులు తప్ప.
మనిషి తెల్లగున్నడే కాని, అతని
దారంతా చీకటి వలయాలే.
పొద్దుపొడుపుతో వాడు బతుకు పాటెత్తుకుంటే
కూటికొరకే కోటి విద్యల సామ్యత గుర్తొస్తుంది
అతని బతుకు పోరాటపు ఆట పొద్దుపోయేదాకా
సాగుతూ... సాగుతూ... సాగుతునే ఉం టుంది.
వాడు పూలమ్ముతున్నాడో, తన
జీవితాన్నమ్ముతున్నాడో.
రోజులు కరిగి, ఏండ్లు అరిగి
జీవిత సారం అంతా ఇంకే దాకా
వాడి సుదూర స్వప్నాల మరీచిక
అతన్నింకా పరిగెత్తిస్తూనే ఉంటుంది.
వాడు ప్రజలకు పరిమళాలు పంచుతునే ఉంటాడు.
అతని బతుక్కు పూల సొబగులద్దేదెవరో?

-'ఉదయగిరి'